క్లుప్తంగా

నీటి సమస్య రాకుండా చూడండి



పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: పట్టణంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని నాల్గవ వార్డులో ఆయన పర్యటించారు. తాగు నీరు, పారిశుద్ధ్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో తాగు నీటి సరఫరా సక్రమంగా చేపట్టాలని, ఎక్కడైనా పైపులైన్ మరమ్మతులు చేయాల్సి వస్తే వెంటనే చేపట్టాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ యాదగిరి, మున్సిపాలిటీ శానిటరి ఇన్‌స్పెక్టర్ మురళీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సన్మానం పొందిన గ్రామపంచాయతీ కార్మికులు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో సమస్యలుంటే తెలియజేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం పంచాయతీ సమావేశంలో పాల్గొని కార్మికులతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలుంటే అధికారులు దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తామని మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, మాజీ సర్పంచ్ శివాంజనేయులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దామోదర్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామపంచాయతీల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ ఎం.దామోదర్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుద్ధ్య ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిధర్‌రెడ్డి, పీఆర్ఏఈ విజయ్‌కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించినందుకు ఎంపీడీఓను గ్రామ కార్యదర్శులు సత్కరించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఎంపీడీఓ మధులత, ఎంపిఓ వైద్య శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లిలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను మాజీ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణాలను ఫణంగా పెట్టి మురికి కాలువలు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచే కార్మికుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు సమయానికి మించి పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా మార్చారని కితాబిచ్చారు.

ప్రజలతో మమేకం కావాలి



సంగారెడ్డి టౌన్: ప్రజలతో మమేకమై ప్రతిఒక్కరికీ పోస్టల్ శాఖ పథకాలు చేరవేయాలన్నదే డీసీడీపీ ముఖ్య ఉద్దేశమని సంగారెడ్డి పోస్ట్ మాస్టర్ సురేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో గురువారం ప్రారంభించారు. అంతకుముందు సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీసీ పీఎల్ఐ మేనేజర్ వనజ, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

'సేవాలాల్' సంబురం

తమ ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం గిరిజనులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. సేవాలాల్ గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పలుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బోనాల ర్యాలీలో మహిళల నృత్యం



కౌడిపల్లి: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



మిర్జాపల్లితండాలో..



పెద్దశంకరంపేటలో..



రేగోడ్‌లో..



చిలప్‌చెడ్‌లో..



శివ్వంపేట మండలం సితారంతండాలో బోగ్ భండార్ నిర్వహిస్తున్న గిరిజనులు



చేగుంటలో..



తూప్రాన్‌లో..

గిరిజన బిడ్డల్ని గుండెల్లో దాచుకుంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు

పాపన్నపేట(మెదక్): శ్రమైక జీవన సౌందర్యానికి మారు పేరైన గిరిజన బిడ్డల్ని జీవితాంతం తన గుండెల్లో దాచుకుంటానని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని నార్సింగి శివారులో దేవగిరి మహరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సేవాలాల్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ స్వధర్మ పరాయణతకు మారు పేరుగా నిలిచి, గిరిజనుల్ని మంచి పౌరులుగా తీర్చి దిద్దారన్నారు. బీటీ రోడ్డు నుంచి సేవాలాల్ ఆలయం వరకు సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కోఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, ఏడుపాయల మాజీ చైర్మన్ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీపై వివాదం



సీతారాంపూర్ గ్రామపంచాయతీ భవనం వద్దకు ట్రాలీ ఆటోలో వచ్చిన రేషన్ బియ్యం

నర్సాపూర్ రూరల్: మండలంలోని సీతారాంపూర్‌లో రేషన్ బియ్యం పంపిణీ పై రెండు పార్టీల కార్యకర్తల మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. సీతారాంపూర్‌లో రేషన్ సరుకుల పంపిణీ దుకాణం లేకపోవడంతో కొన్నేళ్లుగా 2కిలోమీటర్ల దూరంలో ఉన్న రుస్తుంపేటకు కాలినడకన వెళ్లి సరుకులు తెచ్చు కుంటున్నారు. ఇటీవల ఆరు గ్యారంటీల పథకం దరఖాస్తుల స్వీకరణ ముగింపు కార్యక్రమానికి మంత్రి దామోదర హాజరయ్యారు. ఆ సమయంలో రేషన్ సరుకుల కోసం ఇబ్బంది పడుతున్నట్లు సీతారాంపూర్ గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి సీతారాంపూర్‌లో రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఆ గ్రామంలో రేషన్ పంపిణీకి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రుస్తుంపేట రేషన్ డీలర్ ట్రాలీ ఆటోలో బియ్యం తీసుకువచ్చి గ్రామపంచాయతీ భవనం వద్ద బియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇక్కడ బియ్యం ఇవ్వొద్దని తాము సూచించిన ప్రాంతంలో ఇవ్వాలని మాజీ ఉప సర్పంచ్‌తో పాటు మరి కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుబట్టారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామపంచాయతీ భవనం వద్దే ఇవ్వాలని వాదన దిగారు. ఈ విషయం తహసీల్దార్ లింబద్రికి రేషన్ డీలర్ ఫోన్ ద్వారా తెలిపాడు. బియ్యం పంపిణీ అడ్డుకునేవారిపై ఫిర్యాదు చేయాలని డీలర్‌కు సూచించారు. ఈ విషయాన్ని ఇరు పార్టీల నాయకులకు తెలపడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తహసీల్దార్ ఆదేశాలతో గ్రామ పంచాయతీ భవనం వద్ద రేషన్ బియ్యం పంపిణీ చేశారు.

యువతకు ఛత్రపతి శివాజీ ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): యువతకు ఆదర్శం.. ఛత్రపతి శివాజీ మహారాజ్ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. నార్సింగి మండల పరిధిలోని భీమ్‌రావుపల్లి గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశరక్షణ, ధర్మం కోసం పనిచేసిన గొప్ప స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. మాజీ ఎంపీపీ కర్ణపాండు, మాజీ సర్పంచ్‌లు బాల్‌చందర్, ఎల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ హరిశంకర్, బీజేపీ నాయకులు గోవింద్, భూపాల్, మాజీ వార్డుసభ్యులు భూషణం, బీజేపీ యూత్ నాయకులు నరేష్, అంజి, గ్రామ యువకులు సంతోష్, భిక్షపతి, నర్సింహులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ

చిన్నశంకరంపేట(మెదక్): దేశం కోసం ధర్మం కోసం పనిచేసిన గొప్పస్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. నార్సింగి మండలం బీమ్‌రావుపల్లి గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హిందూ సామ్రాజ్యంపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టి అఖండ భారత సామ్రాజ్యాన్ని స్థాపించిన మహానాయకుడు శివాజీ మహరాజ్ అని కొనియాడారు. శివాజీ విగ్రహాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయడం ఆయన అందించిన గొప్ప ఆదర్శమార్గానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్ణపాండు, మాజీ సర్పంచ్‌లు బాల్‌చందర్, ఎల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ హరిశంకర్, బీజేపీ నాయకులు గోవింద్, భూపాల్, మాజీ వార్డు సభ్యులు భూషణం, బీజేపీ యూత్ నాయకులు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

● ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు బానిస కావొద్దని నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ నిర్వహించిన గ్రామ సభకు హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారి జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామ పెద్దలు దుర్గారెడ్డి, వినోద్‌రెడ్డి, కారోబార్ అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపల్ కమిషనర్‌గా దేవేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కామారెడ్డి కమిషనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా, అడిషనల్ కలెక్టర్ రమేశ్‌ను దేవేందర్ కలిసి మొక్కలు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

అన్న హత్య కేసులో నిందితుడి అరెస్టు

శివ్వంపేట(నర్సాపూర్): అన్నను హత్య చేసిన తమ్ముడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి ఉసిరికపల్లికి చెందిన ఎరుకల వెంకటేశ్‌ని వరుసకు తమ్ముడైన ఎరుకల నర్సింలు మంగళవారం అర్ధరాత్రి హత్య చేశాడు. నర్సింలు భార్యతో వెంకటేశ్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో హత్య చేసినట్లు చెప్పారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి నర్సాపూర్ కోర్టులో రిమాండ్ చేసినట్లు చెప్పారు.

రోడ్డెక్కిన గిరిజనులు

శివ్వంపేటలో రాస్తారోకో



ఆందోళనకారులకు నచ్చచెబుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు వివాదాస్పద స్థలం కేటాయించారంటూ గిరిజనులు రోడ్డెక్కారు. తూప్రాన్- నర్సాపూర్ హైవే పై గురువారం ఆందోళనకు దిగారు. ఆలయ నిర్మాణం కోసం చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 114 లో 05 గుంటల భూమిని రెండు రోజుల క్రితం తహసీల్దార్ శ్రీనివాస్‌చారి గిరిజనులను చూపించారు. గురువారం భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ భూమి తమది అంటూ చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన దళితులు అడ్డుకున్నారు. ఆలయ నిర్మాణానికి వివాదాస్పద స్థలాన్ని కేటాయించడంపై గిరిజనులు మండిపడ్డారు. జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలు స్వయంగా జోక్యంచేసుకుని సర్దిచెప్పినా వారు వినిపించుకోలేదు. పోలీసులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు గిరిజనులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింప చేశారు.

ఎంపీడీఓ చారి సేవలు శ్లాఘనీయం



ఎంపీడీఓ జగదీశ్వర్ చారిని సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా సన్మానించిన ప్రజాప్రతినిధులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ జగదీశ్వర్ చారిని ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నార్లాపూర్ మాజీ సర్పంచ్ అమరాసేనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, అయితే.. ఎంపీడీఓగా జగదీశ్వర్‌చారి నిజాంపేట మండలాభివృద్ధికి ఎంతాగానో కృషి చేశారని కితాబిచ్చారు. అలాగే బదిలీపై ఇక్కడికి వచ్చిన ఎంపీడీఓ రాజిరెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేశ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీఓ రాజేందర్, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి పాంబండ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతికి చెందిన విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం మోహన్‌రావు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కార్యక్రమాన్ని హెచ్ఎం ప్రసూన, ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, పాండురంగం, కిషోర్ పర్యవేక్షించారు.



మల్కాపూర్‌లో స్వయంపరిపాలన దినోత్సవం

'భూమికి భూమి ఇస్తేనే ఒప్పుకుంటాం'



రైతులతో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): సంగారెడ్డి కెనాల్ కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న వారికి భూమికి బదులు భూమిని ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల, చెన్నాపూర్ గ్రామాల మీదుగా సంగారెడ్డి కెనాల్ నిర్మించేందుకు అధికారులు భూ సేకరణ కోసం ఆయా గ్రామాల్లో రైతులతో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్, సంగారెడ్డి కెనాల్‌కు సంబంధించి భూమి ఇచ్చేందుకు ఎకరాకు రూ.కోటి 50లక్షలు ఇవ్వాలని, లేదంటే భూమికి బదులు భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతులు లేవనెత్తిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. ఆర్ఐ కిషన్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు కంటి ఉచిత వైద్యశిబిరం**

చేగుంట(తూప్రాన్): కంటి ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరణం నర్సింహులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **తృటిలో తప్పిన ప్రమాదం**

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామంలో గురువారం ఓ ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకలి మైసమ్మ వంట చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

◆ **ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ**



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి సామ్యతండాలో జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. పురోహితుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రవి నాయక్, తండానాయకులు పాల్గొన్నారు.

◆ **నేడు పాపన్నపేటలో విద్యుత్ వినియోగదారుల సదస్సు**

టేక్మాల్(మెదక్): పాపన్నపేట విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఈనెల 16న విద్యుత్ వినియోగదారుల సదస్సు ఉంటుందని ఏఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందని వినియోగదారులు ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు తీసుకురావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 194 మంది హాజరు**

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం 194మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సమయాల్లో జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 198మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజర్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

◆ **విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు**

శివ్వంపేట(నర్సాపూర్): తహసీల్దార్ కార్యాలయం వద్ద సిబ్బంది విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధి చెన్నాపూర్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్ద బైక్‌ని అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయగా.. అక్కడ విధుల్లో ఉన్న వీఆర్ఏ ఆంజనేయులు బైక్‌ని పక్కకు పెట్టాడు. దీంతో ఆంజనేయులు కాలర్ పట్టుకుని నర్సింహారెడ్డి దూషించాడు. ఇరువురు గొడవ పడుతుండగా సర్దిచెప్పేందుకు మధ్యలోకి వెళ్లిన కార్యాలయ రికార్డు అసిస్టెంట్ రేణుకను సైతం దూషించినట్లు చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు నర్సింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

◆ **పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత**

కొల్చారం(నర్సాపూర్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రంగంపేట ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి నగేష్ పేర్కొన్నారు. గురువారం పారిశుద్ధ్యంపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌పై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కారోబార్ దశరథ్, సిబ్బంది వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



◆ **మున్సిపల్ అభివృద్ధికి కృషి**

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన మంగతాయారును గురువారం మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.